క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో ఆర్‌సీఎం చర్చి పండగ



పెద్దలను నృత్యాలతో స్వాగతం పలుకుతున్న విశ్వాసకులు

భామిని: మండల కేంద్రలోని ఆర్‌సీఎం చర్చి పండగను క్రైస్తవ భక్తులు ఆదివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఫాదర్లు బోగి సంజీవరావు, ప్రతాప్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. అంతకుముందు గ్రామస్తులు నృత్యాలతో వీరిని ఆహ్వానించారు. ఆర్‌సీఎం చర్చి కమిటీ చైర్మన్ లోపింటి రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

అమిత్ షా రాష్ట్ర పర్యటన రద్దు చేయాలి



డా.బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న వామపక్ష నాయకులు

పార్వతీపురంటౌన్: రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్‌ను అవమానపరిచిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఏపీ పర్యటనను రద్దు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బీవీ రమణ అన్నారు. ఈ మేరకు ఆదివారం పార్వతీపురం ఆర్టీసీ కాంప్లె క్స్ నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో పట్టణంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యున్నత పార్లమెంట్‌లోనే రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్‌కు అవమానం జరిగిందని, అంతటి అవమానకరమైన వ్యాఖ్యలు చేసిన హోంమంత్రి అమిత్ షా తక్షణమే రాజీనా మా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకుడు టి.జీవా, సీపీఎం నాయకులు గొర్లి వెంకటరమణ, పి.రాజశేఖర్, బి.సూరిబాబు, పాకల సన్యాసిరావు, సీపీఐఎంఎల్ నాయకులు పి. రమణి, బి.నరసింగరావు, భాస్కర రావు, పి.సంఘం, గిరిజన సంక్షేమ సంఘం నాయకులు పి.రంజిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మైనర్లకు వాహనాలు ఇస్తే చర్యలు



స్పెషల్ డ్రైవ్‌లో పాల్గొన్న ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది

పార్వతీపురంటౌన్: మైనర్లకు వాహనాలు ఇస్తే చర్యలు తప్పవని ట్రాఫిక్ ఎస్సై పాపారావు హెచ్చరించారు. ఈ మేరకు ఆదివారం పార్వతీపురం ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలి వద్ద స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల మృతులలో ఎక్కువమంది మైనర్లే ఉన్నారన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే వాహన యజమానులపై కేసు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ వాహనాలు నడిపేటప్పుడు విధిగా బండి పత్రాలను వెంట ఉంచుకోవాలని సూచించారు. పెండింగ్ చలానాలు, రవాణాశాఖ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠినంగా వ్యవహరిస్తామని పేర్కొన్నారు. ర్యాష్ డ్రైవింగ్, సెల్ ఫోన్ డ్రైవింగ్ వంటివాటిపై ప్రత్యేక నిఘా పెట్టామని తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు క్రమం తప్పకుండా డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలు

సాలూరు రూరల్: మండలంలోని మామిడిపల్లి గ్రామంలో 18,19 తేదీలలో రూరల్ ఎస్సై నరసింహ మూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ పోటీలలో ఏజెన్సీ ప్రాంతం నుంచి 32 టీమ్‌లు పాల్గొన్నాయి. అందులో దిగువ మెండంగి గ్రామస్తులు విజేతలుగా నిలిచారు. విజేతలకు ఎస్సై నరసింహమూర్తి బహుమతులు అందజేసి అభినందనలు తెలిపారు.



మొక్కజొన్నకు నీరు కడుతున్న రైతు

మెలకువలు పాటిస్తే ▸ అధిక దిగుబడులు

భామిని:

మెలకువలు పాటిస్తూ సాగు చేపడితే మొక్కజొన్నలో అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయాధికారి కొర్ను సింహాచలం తెలిపారు. సకాలంలో కలుపు నివారిస్తే నాలుగు డబ్బులు కళ్లజూడవచ్చని చెప్పారు. ఈ నేపథ్యంలో సాగుకు సంబంధించి పలు సూచనలు చేశారు. మొక్కజొన్నను ఆహారంగానే కాకుండా కోళ్లు, పశువులకు దాణాగా.. వివిధ పరిశ్రమల్లో ముడి సరుకుగా ఉపయోగిస్తుంటారు. జిల్లాలో వేలాది ఎకరాల్లో మొక్కజొన్న సాగవుతోంది. రబీలో నీటిపారుదల కింద మొక్కజొన్న సాగు చేస్తున్నారు. మొక్కజొన్నకు పోషకాలు, నీరు అధికంగా అవసరమవుతుంది. దీంతో పాటు కలుపు సమస్య కూడా ఎక్కువగా ఉంటుంది. ఈ నేపథ్యంలో సకాలంలో కలుపు తీయాల్సి ఉంటుంది. ముఖ్యంగా వరి మాగాణుల్లో సాగుచేసే మొక్కజొన్నలో గడ్డి జాతికి చెందిన తుంగ, గరికి, ఊద.. వెడల్పాకు జాతికి చెందిన చెంచలికూర, పిచ్చి తోటకూర, గలిజేరు, నేల ఉసిరి, గుంట గలవరి వంటి కలుపు మొక్కలు ఎక్కువగా ఉంటాయి. కలుపు తీయకపోతే దిగుబడి బాగా తగ్గిపోయే అవకాశం ఉంది.

- జోరుగా మొక్కజొన్న సాగు
- సకాలంలో కలుపు నివారిస్తే కాసులే కాసులు..



కొర్ను సింహచలం, ఎంఏఓ,భామిని.

కలుపు నివారణ మార్గాలు..

- విత్తిన 45 రోజులకు సాళ్ల మధ్య ఖాళీ ప్రదేశంలో కలుపు మొలుస్తుంది. కలుపు మొక్కలు పెరిగాయంటే మొక్కజొన్న మొక్కలు పెరగవు. అందుకే వివిధ మార్గాల ద్వారా కలుపు నివారించాలి.
- అంతరకృషి లేదా కలుపు మందుల ద్వారా కలుపు నివారించాలి. జీరోటిల్లేజ్ విధానంలో దున్నకుండా విత్తనాలు నాటడం వల్ల నేల గట్టిగా మారడంతో మనుషులతో కలుపు తీయడం కష్టంగా మారుతుంది.
- మొక్కజొన్న విత్తిన వెంటనే ఎకరానికి కిలో అట్రాజిన్ 50 శాతం పొడి మందును 200 లీటర్ల నీటిలో కలిపి నేలంతా తడిచేలా పిచికారీ చేస్తే కలుపు మొక్కలు నివారించవచ్చు.
- మొక్కజొన్న చుట్టుపక్కల అపరాలు సాగు చేస్తే అట్రాజిన్ బదులుగా పెండిమిథాలిన్ 30 శాతం ఎకరానికి లీటర్ మందును 200 లీటర్ల నీటిలో కలిపి చేనుపై పిచికారీ చేయాలి.
- వరి దుబ్బుల నివారణకు అట్రాజిన్ వంటి మందులతో పాటు ఎకరానికి పారాక్వాట్ 24 శాతం కలిపి పిచికారీ చేయాలి. విత్తిన వెంటనే లేక రెండు, మూడు రోజుల్లోపు పిచికారీ చేయాలి.
- మొక్కజొన్న పైరు 20, 30 రోజుల దశలో తుంగ, వెడల్పాకు కలుపు మాత్రమే ఉన్న పరిస్థితుల్లో 2,4–డి ఎమైన్ సాల్ట్ 58 శాతం ఎకరానికి 400 మిల్లీలీటర్ల మందు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. గడ్డి, ఆకు జాతి కలుపు కూడా ఉన్నప్పుడు టంబోట్రియాన్ 34.4 శాతం ఎకరానికి 115 ఎంఎల్ లేదా టోప్రిమిజోన్ 33.6శాతం ఎకరానికి 30 ఎంఎల్‌ను 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

ఎత్తిపోతల పథకం హామీని నెరవేర్చాలి..

భామిని: మండలంలోని వడ్డంగి ప్రాంతం వద్ద ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని టీడీపీ నాయకులు నెరవేర్చాలని రైతులు కోరుతున్నారు. మండలంలో తీవ్ర సాగునీటి కొరత గల వడ్డంగి, బొమ్మిక, లోహరజోల, పక్కుడుబద్ర, నులకజోడు గ్రామాల్లోని చెరువులకు లిఫ్టుల ద్వారా వంశధార నీరు పంపించాలని రైతులు కోరుతున్నారు. రైతుల ఇబ్బందులను ఏపీ రైతు సంఘం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లింది. అలాగే ఎన్నికల సమయంలో ప్రస్తుత ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని, ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని రైతులు కోరుతున్నారు.



గత టీడీపీ ప్రభుత్వం వేసిన ఎత్తిపోతల పథక శిలాఫలకం

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాలకు సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు ఆ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.రాజేంద్రప్రసాద్ ఓ ప్రకటనలో ఆదివారం తెలిపారు. ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 2:30 గంటల వరకు కరెంట్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

అక్రమంగా కంకర తవ్వకాలు

- పట్టించుకోని అధికారులు

బలిజిపేట: మండలంలో అక్రమంగా కంకర తవ్వకాలు జోరుగా సాగుతున్నా రెవెన్యూ యంత్రాంగం పట్టించుకోవడం లేదు. బందలలో కానీ, జిరాయితీ భూమిలో కానీ తవ్వకాలు జరపాలంటే స్థానిక తహసీల్దార్ అనుమతులు అవసరం. అక్రమంగా తవ్వకాలు జరిపి బాహాటంగా రియల్ ఎస్టేట్ భూములలో వేసి చదును చేసుకుంటున్నా పట్టించుకుంటున్న దాఖలాలు లేవు. అక్రమంగా కంకర తవ్వేవారిపై కఠిన చర్యలు చేపడతామని ప్రభుత్వం హెచ్చరిస్తున్నా బాహాటంగా అక్రమ తవ్వకాలు చేయడంలో ఆంతర్యం ఎవరికి అంతుపట్టడం లేదు. ప్రభుత్వ నిబంధనలు బేఖాతరుచేస్తూ అక్రమ తవ్వకాలు చేస్తున్నవారికి అధికారులు కొమ్ముకాస్తున్నారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రత్యేకించి ఆదివారం రోజున ఈ విధంగా అక్రమ తవ్వకాలు చేపట్టడం వెనుక ఆంతర్యం ఏమిటనేది ప్రశ్నార్థకంగా ఉంది. బలిజిపేట మండలంలోని చెల్లెంపేట వెళ్లే మార్గంలో బందల వద్ద అక్రమంగా కంకర తవ్వి చిలకలపల్లి సమీపంలో ఉండే రియల్ ఎస్టేట్ భూమిలో వేసి చదునుచేస్తున్నా పట్టించుకోకపోవడం దారుణంగా ఉంది. జేసీబీలతో బందలలో గుమ్ములు పెట్టి గ్రావెల్ తీయడం వల్ల ఆ గుమ్ములు ప్రమాదకరంగా మారుతున్నాయని గ్రామాలకు చెందిన ప్రజలు వాపోతున్నారు. వీటిని రెవెన్యూ అధికారులు కానీ, మైనింగ్ అధికారులు కానీ పట్టించుకోకపోవడంతో అక్రమ తవ్వకాల జోరు ఎక్కువగా సాగుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీనిపై తహసీల్దార్ రత్నకుమారిని వివరణ కోరగా కంకర తీసేందుకు అనుమతులు తీసుకోవాల్సి ఉందని, ఎవరూ ఎటువంటి అనుమతులు తీసుకోలేదన్న విషయం తన దృష్టికి రాలేదన్నారు. దీనిపై తగు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.



బంద వద్ద జేసీబీతో తవ్వి ట్రాక్టరుకు ఎక్కిస్తున్న కంకర



ప్రమాదాల నివారణకు చర్యలు

పాలకొండ: రహదారి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు సీఐ ఎం.చంద్రమళి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. ఇటీవల జరుగుతున్న రహదారి ప్రమాదాల నేపథ్యంలో వాహనదారులకు సూచనలు చేస్తున్నట్లు చెప్పారు. మద్యం మత్తులో వాహనాలు నడిపే వారికి కౌన్సెలింగ్ ఇస్తున్నట్లు తెలిపారు. ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

విరిగిపోయిన విద్యుత్ స్తంభాలు

- పట్టించుకోని విద్యుత్ అధికారులు



బూర్జ వద్ద విరిగిన మూడువిద్యుత్ స్తంభాలు

సీతానగరం: మండలంలోని గ్రామాలకు నిరంతర విద్యుత్ సరఫరా చేయడానికి రోడ్డుకు ఇరువైపులా వేస్తున్న 27 అడుగుల స్తంభాలు వేసిన నెలరోజులకే విరిగి పోవడంతో సరుకు నాణ్యత కొరవడిందని స్థానికులు విమర్శిస్తున్నారు. సీతానగరం మండకేంద్రం నుంచి లక్ష్మీపురం –బూర్జ మీదుగా పెదంకలాం వరకు విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో కన్‌స్ట్రక్షన్ డిపార్ట్‌మెంట్ రోడ్డును ఆనుకుని ఎత్తైన విద్యుత్ స్తంభాలతో విద్యుత్ తీగలు వేసే పనులు చేస్తున్నారు. బూర్జవద్ద వేసిన విద్యుత్ స్తంభాలకు వైర్లు వేయగానే విరిగి పోవడంతో రోడ్డుమీదుగా తిరుగాడుతున్న ప్రయాణికులు, వాహన చోదకులు అసౌకర్యానికి గురవుతున్నామని అంటున్నారు. విద్యుత్ స్తంభాల తయారీలో నాణ్యతా ప్రమాణాలు పాటించక పోవడం వల్ల బీటీ రోడ్డుకు ఆనుకుని స్తంభాలు వేయడం వల్ల ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు విరిగి పోవడానికి కారణమని అంటున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి విద్యుత్ స్తంభాల తయారీలో నాణ్యతా ప్రమాణాలు పరిశీలించాలని, రోడ్డుకు దూరంగా విద్యుత్ స్తంభా లు పాతించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. విద్యుత్ స్తంభాల ఏర్పాటు పనులపై సమగ్రమైన దర్యాప్తు చేయాలని కోరుతున్నారు.

పనులు వేగవంతం..

సీతంపేట: మల్టీపర్పస్ పనులు వేగవంతం చేయాలని ఐటీడీఏ పీఓ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి అన్నారు. మండలంలోని జలుబుగూడ, పాంద్ర, బాపన్నగూడ, తదితర గ్రామాల్లో నిర్మాణంలో ఉన్న భవనాలను పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలపై ఆరా తీశారు. అనంతరం మండలంలోని మండ గ్రామంలోని మంచినీటి కోసం ఏర్పాటు చేస్తున్న ఓవర్‌హెడ్ ట్యాంక్ పనులు పరిశీలించారు. కుశిమి పీహెచ్‌సీని సందర్శించారు. బయోవ్యర్థాలు లేకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ఆస్పత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు.



పనులను పరిశీలిస్తున్న పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి

ముగిసిన వాలీబాల్ పోటీలు

గుమ్మలక్ష్మీపురం: సంక్రాంతి పండగ సందర్భంగా మండలంలోని రాయగడజమ్ము పంచాయతీ, పెద రావికోన గ్రామంలో కొన్నిరోజులుగా నిర్వహిస్తున్న వాలీబాల్ టోర్నమెంట్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. మొత్తం 20 జట్లు ఈ పోటీల్లో పాల్గొనగా, ఆఖరి పోరు చినరావికోన, పెదరావికోన గ్రామాల జట్ల మధ్య జరిగింది. విజేతగా చినరావికోన జట్టు నిలవగా, రన్నరప్‌గా పెదరావికోన జట్టు నిలిచింది. అనంతరం జరిగిన బహుమతుల ప్రదానోత్సవంలో ఆయా జట్లకు ట్రోఫీ, మెమొంటోలు, నగదు బహుమతిని నిర్వాహకులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పత్తిక అమల, పోటీల నిర్వాహకులు బీసు, మోహన్‌రావు, బుజ్జిబాబు, లంకారావు, ఆనంద్, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.



విజేత జట్టు సభ్యులకు నగదు బహుమతి అందజేస్తున్న గ్రామపెద్దలు, నిర్వాహకులు

హెచ్చరిక బోర్డుల ఏర్పాటు



ఆదలి వ్యూ పాయింట్‌కు వెళ్లే మార్గంలో ఎస్సై వై. అమ్మన్నరావు ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం హెచ్చరికబోర్డులు ఏర్పాటు చేశారు. ఇటీవల కాలంలో ఈ ప్రాంతంలో ప్రమాదాలు జరుగుతుండడంతో ప్రయాణికులను అప్రమత్తం చేసేందుకు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఆటోలు, నాలుగు చక్రాల వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలన్నారు. - సీతంపేట

న్యాయం చేయాలి..



ఇటీవల ఆదలి వ్యూ పాయింట్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సవర రెల్లయ్య కుటుంబానికి న్యాయం చేయాలని గిరిజన ఆదివాసీ జేఏసీ నాయకులు బిడ్డిక శ్రీనివాసరావు, బి.ఉమామహేశ్వరరావు, స్థానిక ప్రజాప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బొక్కుడుగూడలో ఆదివారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పర్యాటక ప్రాంతమైన ఆదలి వ్యూ పాయింట్‌కు వెళ్లేందుకు సరైన రోడ్లు లేకపోవడంతో ఎప్పటికప్పుడు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రభుత్వం స్పందించి ప్రమాద నివారణ చర్యలు చేపట్టడంతో పాటు మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎన్.తిరుపతిరావు, వైస్ సర్పంచ్ రమేష్, తదితరులు పాల్గొన్నారు. - సీతంపేట

పూర్వ విద్యార్థుల సమ్మేళనం..



భామిని మండలం బత్తిలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1988-89 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులందరూ పాఠశాల ఆవరణలో ఆదివారం కలుసుకున్నారు. ఈ సందర్భంగా చిన్ననాటి సంగతులను గుర్తు చేసుకుంటూ సందడిగా గడిపారు. - భామిని

నిబంధనలు తప్పనిసరి



డ్రైవర్లు, ప్రయాణికులకు సూచనలు చేస్తున్న ఏఎస్సై నారాయణరావు

పాలకొండ రూరల్:

ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చడంలో ఆర్టీసీతో పాటు ఆటో, మ్యాక్సీ క్యాబ్, కారు డ్రైవర్లు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఏఎస్సై నారాయణరావు అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం రోడ్డుభద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిమితికి మించి ప్రయాణికులతో రాకపోకలు సాగించడం వల్ల ప్రమాదాలు చోటుచేసుకుంటాయన్నారు. వాహనాలకు సంబంధించిన అన్ని రకాల పత్రాలు దగ్గర ఉంచుకోవాలని సూచించారు.

పొగమంచుతో ప్రమాదం!

గుమ్మలక్ష్మీపురం:

- దట్టంగా కురుస్తున్న పొగమంచు
- ఉదయం 9 గంటలైనా కనిపించని సూర్యుడు
- సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం
- జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్న వైద్యులు

ఏజెన్సీ ప్రాంతాల్లో పొగమంచు దట్టంగా కురుస్తోంది. ప్రతిరోజూ కురుస్తున్న మంచు కారణంగా చలి తీవ్రత కూడా ఎక్కువగానే ఉంటోంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసరమైతే తప్ప ఎవరూ బయటకు వెళ్లడం లేదు. దీంతో ఎప్పుడు జరగాల్సిన పనులు అప్పుడు జరగడం లేదని, పనులు వాయిదా కూడా పడుతున్నాయని పలువురు వాపోతున్నారు. మరోవైపు గుండె, ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధులతో బాధపడేవారు, ఆస్తమా రోగులు వీలైనంతవరకు మంచులో తిరగకపోతే మంచిదని వైద్యులు సూచిస్తున్నారు. ముఖ్యంగా దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు చాలా జాగ్రత్తగా ఉండాలని, అప్రమత్తతతోనే రక్ష అని సలహా ఇస్తున్నారు. ఆరోగ్యం కాపాడుకునేందుకు చిన్నచిన్న జాగ్రత్తలు పాటిస్తే చాలు అని చెబుతున్నారు.

పాటించాల్సిన జాగ్రత్తలు..

- మంచులో తిరగవద్దు.. చల్లని పదార్థాలు తీసుకోవద్దు.
- అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లొద్దు.
- అవసరమై బయటకు వస్తే ముఖానికి మాస్క్ ధరించాలి.
- ఉదయం వాకింగ్‌కు వెళ్లే వారు కాళ్లకు బూట్లు, చేతులకు గ్లౌజ్‌లు, బుర్రకు టోపీ పెట్టుకోవాలి.
- ఆయాసం రాకముందే ఆస్తమా రోగులు మందులు వేసుకోవాలి.
- ఏడాదిలోపు పిల్లలను వెచ్చని ప్రదేశాల్లోనే వీలైనంత వరకు ఉంచాలి.
- ప్రయాణాల సమయంలో చిన్నపిల్లల శరీరాన్ని పూర్తిగా కప్పి ఉంచాలి.
- ఆరోగ్యానికి విటమిన్–సి లభించే ఉసిరి, జామ, నిమ్మ, ద్రాక్షతో పాటు క్యాబేజీ, క్యాప్సికం, టమాటా వంటివి తీసుకోవాలి.



ఉన్ని దుస్తులు ధరించాలి..

శీతాకాలంలో ఆరోగ్య సంరక్షణకు తగిన జాగ్రత్తలు పాటించాలి. సీజనల్ జ్వరాలు, జలుబు, దగ్గు త్వరగా వచ్చే అవకాశం ఉంది. ఆస్తమా, శ్వాసకోశ వ్యాధులతో బాధపడే వారు మరింత అప్రమత్తంగా ఉండాలి. అనారోగ్యం బారినపడిన వెంటనే వైద్యులను సంప్రదించాలి.

–ఎం.బుద్దేశ్వరరావు, పీహెచ్‌సీ వైద్యాధికారి, తాడికొండ

గుమ్మలక్ష్మీపురంలో దట్టంగా కురుస్తున్న పొగమంచు